క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ



నెల్లూరు(సెంట్రల్): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఢిల్లీలో గురువారం కలిశారు. నెల్లూరులోని వీఆర్ కళాశాలలో బీఈడీ కోర్సును పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవం



మాట్లాడుతున్న విజయలక్ష్మి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రంగనాయకులపేట సెక్టార్‌లోని కపాడిపాళెం – 3 అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్, ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడారు. ప్రీ స్కూల్‌పై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను బోధించడం ద్వారా వారిలో మనోవికాసం పెంపొందుతుందని చెప్పారు. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు శైలజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సమతుల్యత అవసరం



మాట్లాడుతున్న నాగార్జున

కొడవలూరు: యువతకు ఆర్థిక సమతుల్యత అవసరమని ఎన్ఐఎస్ఎమ్ ట్రెయినర్ నాగార్జున పేర్కొన్నారు. ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్‌పై అనే అంశంపై నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మ్యూచువల్ ఫండ్స్, ప్రైమరీ, సెకండరీ మార్కెట్, ఇంపార్టెన్స్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్, కెరీర్ ఇన్ సెక్యూరిటీ మార్కెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ గుణశేఖర్, ఆర్ అండ్ డీ డీన్ వెంకటనాగేంద్ర, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నిబంధనల మేరకే పీటీసీ సమావేశం



మాట్లాడుతున్న వసంతకుమారి

కొడవలూరు: విద్యాశాఖ కమిషనర్ సూచనలకు అనుగుణంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను శనివారం నిర్వహించాలని ఎంఈఓ వసంతకుమారి సూచించారు. కార్యక్రమ ఏర్పాట్లపై మండలంలోని బొడ్డువారిపాళెంలో గల ఓవెల్ పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు వంద శాతం హాజరయ్యేలా హెచ్ఎంలు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంఈఓ అంకయ్య మాట్లాడారు. సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రుల గౌరవ మర్యాదలకు ఎలాంటి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉందని పేర్కొన్నారు.

ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు



కొడవలూరు: కొడవలూరులోని దళితవాడలో ఫైలేరియా నిర్ధారణ పరీక్షలను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫైలేరియా నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించడమే లక్ష్యంగా పరీక్షలు చేస్తున్నామని వివరించారు. హెచ్ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎంలు శేషుబాయి, సుభాషిణి పాల్గొన్నారు.

సేవే పరమార్థం

- పోలీసులకు దీటుగా సేవలు
- హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవం నేడు

నెల్లూరు(క్రైమ్): పోలీస్ శాఖలో ఉద్యోగం.. శరీరంపై ఖాకీ యూనిఫారం.. పోలీసులతో సమానంగా సేవలు.. అయినా ఉద్యోగ భద్రత కరువు.. గుర్తింపూ అంతంతమాత్రమే.. అందరిలో చులకనభావం.. ఉద్యోగ విరమణ పొందినా ఆర్థిక భద్రతా మృగ్యమే.. అయినా సేవే పరమార్థంగా సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డులు అందిస్తున్న సేవలు నిరుపమానం. హోంగార్డ్స్ రైజింగ్ డేను శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

వ్యవస్థ ఆవిర్భావమిలా..

బ్రిటిష్ పాలన నుంచి దేశం విముక్తి పొందుతున్న సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించేందుకు.. సమాజంలో అలజడులను శాంతియుతంగా అదుపు చేసేందుకు.. ఇతర సేవలందించేందుకు వీలుగా స్వచ్ఛంద సమూహంగా ఓ వ్యవస్థ 1946, డిసెంబర్ ఆరున ఏర్పడింది. స్వాతంత్ర్యం వచ్చాక ఈ బృందాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలకు సేవలందిస్తూ వచ్చాయి. ఆపై దేశంలో ఎక్కువైన సమస్యలు, పోలీసులపై పనిభారం పెరగడంతో ఈ బృందాలపై ప్రభుత్వ దృష్టి పడింది. 1962 చైనా యుద్ధం తర్వాత సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీస్ శాఖకు కొంత పనిభారం పెరిగిన నేపథ్యంలో వీరికి సాయంగా.. సేవలను అందించేలా ఈ వ్యవస్థను ఉపయోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఆధ్వర్యంలో హోంగార్డ్ యాక్ట్ – రూల్స్‌ను రూపొందించి స్వచ్ఛంద సంస్థల సమూహాలను హోంగార్డ్‌గా ఆవిష్కరించారు.

పలువురికి ఆదర్శం

ఓ వైపు జీతాలు తక్కువైనా జీవనాన్ని నెట్టుకొస్తున్న వీరు, తమలో ఎవరికైనా కష్టమొస్తే చలించిపోతారు. బాధిత హోంగార్డు కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తారు. హోంగార్డు ఎవరైనా చనిపోయినా.. ఉద్యోగ విరమణ పొందినా తమ ఒక రోజు వేతనాన్ని ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ప్రక్రియ జిల్లా నుంచే ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా అందరూ అనుసరించేలా చేసింది. ఈ ఏడాది ఎనిమిది మంది హోంగార్డులు మృతి చెందగా,



కవాతు చేస్తున్న హోంగార్డ్స్ (ఫైల్)

ఇద్దరు ఉద్యోగ విరమణ పొందారు. వీరికి హోంగార్డులు తమ ఒక రోజు వేతనం సుమారు రూ.40 లక్షలను సాయంగా అందజేశారు.

పంటిబిగువున సమస్యలు

భార్యాపిల్లలతో పాటు ఇంటిని వదిలి విధులు నిర్వర్తిస్తున్నారు. నగర రహదారులపై విధులు చేపట్టే సమయంలో కాలుష్య కాటుకు గురవుతున్నారు. వీరి ఆరోగ్య పరిరక్షణకు సరైన పరికరాల్లేవు. కార్మిక చట్టం మేరకు వారంలో ఒక రోజు సెలవివ్వాల్సి ఉన్నా, అడగలేని దుస్థితి. వీరి బదిలీలకు నిబంధనలుండవు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీస్ శాఖలో పనిచేస్తున్న హోంగార్డులకు తమ సమస్యను చెప్పుకొనే అవకాశం లేకపోవడం గమనార్హం. ఒకవేళ నోరువిప్పితే అధికారుల ఆగ్రహానికి గురవ్వాల్సి వస్తుందనే భయంతో బయటకు రానివ్వరు. విధులను సమర్థంగా నిర్వర్తించే హోంగార్డులకు ఉద్యోగ భద్రత లేదు. తమకు ఉద్యోగ భద్రత, ఫించన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

జిల్లాలో ఇదీ తీరు..

జిల్లాలో 721 మంది హోంగార్డులు ఉన్నారు. వీరిలో 73 మంది మహిళలు విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ విధులను 587 మంది.. డిప్యుటేషన్‌పై జెన్‌కో, ఆర్టీఏ, మెరైన్, ఫైర్, ఆర్టీసీ, ఏపీఎస్పీ, జైళ్ల శాఖ, విజిలెన్స్, పోలీస్ హౌసింగ్ బోర్డు, ట్రాన్స్‌కో, ఏసీబీ తదితర విభాగాల్లో 134 మంది విధుల్లో ఉన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు దీటుగా వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. 2019కు ముందు ఉన్న టీడీపీ హయాంలో వీరికి రోజు వేతనంగా రూ.600ను ఇస్తుండగా, 2019లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఈ మొత్తాన్ని రూ.710కి పెంచారు. అప్పటి నుంచి నెలకు రూ.21,300 జీతం వస్తోంది. హోంగార్డులు ప్రమాదంలో మరణిస్తే సంబంధిత బ్యాంకుల నుంచి ప్రమాద బీమాగా రూ.30 లక్షల వరకు అందుతోంది. విధుల్లో ఉండి మరణించిన హోంగార్డు కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగమిస్తారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

పరిశ్రమల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు (బారకాసు): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించేందుకు సమగ్ర వివరాలను నమోదు చేయడంతో పాటు ఎమ్మెస్మీఈ యాప్ ద్వారా పరిశ్రమల సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎమ్మెస్మీఈ సర్వే నిర్వహణకు రూపొందించిన యాప్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణను సచివాలయ మహిళా పోలీస్, వెల్ఫేర్ కార్యదర్శులు, మెప్మా సిబ్బందికి కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలోని పరిశ్రమలను గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. టీపీఆర్వో బాలకృష్ణ, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఐపీఓ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సిబ్బంది

టౌన్ బస్సులకు జీపీఎస్

- మరో రెండు, మూడు రోజుల్లో కార్యరూపం
- త్వరలో మరిన్ని పర్మిట్ల జారీ

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న టౌన్ బస్సుల యాజమాన్యాల ఆగడాలకు రవాణా అధికారులు కళ్లెం వేయనున్నారు. కార్పొరేషన్ పరిధిలో తిరుగుతున్న 39 టౌన్ బస్సులను జీపీఎస్‌తో అనుసంధానం చేసి జియో ట్యాగింగ్ చేయనున్నారు. నిర్దేశించిన పర్మిట్ మేరకు కాకుండా అదనపు రూట్లలో బస్సులను తిప్పుతున్నారాననే విషయాన్ని రవాణా కార్యాలయంలో ఎల్సీడీ ద్వారా అధికారులు గుర్తించనున్నారు. ఈ విధానానికి ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళీకృష్ణ రూపకల్పన చేశారు. టౌన్ బస్సుల యజమానులను పిలిచి వారితో సమావేశాన్ని ఏర్పాటు చేసి జీపీఎస్‌ను అమర్చేలా ఒప్పించారు. ఈ విధానం మరో రెండు, మూడు రోజుల్లో కార్యరూపం దాల్చనుంది. జీపీఎస్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా యజమానులు పొందిన పర్మిట్ రూట్లలోనే బస్సులు తిరగనున్నాయి. దీంతో పాటు సమయపాలన పాటించనున్నారు.

అన్ని రూట్లలో బస్సులు అందుబాటులోకి

ఈ విధానం అమల్లోకి వస్తే నగర ప్రజలకు అన్ని సమయాలతో పాటు అన్ని రూట్లలో టౌన్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. నగరంలో రద్దీ లేని ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలకు తలకు మించిన భారమవుతుంది. ఆటోలో వెళ్లేందుకు రూ.100 నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. టౌన్ బస్సుల్లో రూ.10 నుంచి రూ.20 మేరే చార్జీ ఉంటుంది. ప్రస్తుతం ఉన్న టౌన్ బస్సులతో పాటు మరో 60 మంది నగరంలోని రూట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని సైతం రవాణా అధికారులు త్వరలో పరిశీలించి నిబంధనల మేరకే ఉన్న వారికి పర్మిట్లు జారీ చేయనున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో నేహా సంస్థ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 27 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆర్ఐఓ శ్రీనివాసులు చేతుల మీదుగా గురువారం అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి జ్యూట్ బ్యాగులను విశ్రాంత అధ్యాపకులు కుసుమకుమారి పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ట్రెయినర్ కల్యాణి, కోర్సు కోఆర్డినేటర్లు కృష్ణతులసి, పూర్ణచంద్రకుమారి, అధ్యాపకులు సమత, విజయలక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న వేణుగోపాల్

నెల్లూరు(అర్బన్): ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. దర్గామిట్టలోని యువ కేంద్రంలో అంతర్జాతీయ సేవా దినోత్సవాన్ని నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన 30 మంది స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన, మహిళా సంఘాలకు ప్రశంస పత్రాలను అందజేశారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు ఖాదర్‌బీ, అర్బన్ హెల్త్ సెంటర్ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు తదితరులు వీటిని అందుకున్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



నెల్లూరు (టౌన్): కంప్యూటర్ పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆర్ఐఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎమ్మెస్ ఆఫీస్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, కోర్సు కోఆర్డినేటర్లు సమత, విజయలక్ష్మి, అధ్యాపకులు కృష్ణవేణి, కరుణకుమారి, సుధారాణి, పూర్ణచంద్రకుమారి, కృష్ణతులసి పాల్గొన్నారు.

గుంతా.. అయితే..!



వర్షాల కారణంగా నగరంలోని కనకమహల్ సెంటర్ సమీపంలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. దీన్ని పూడ్చే దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. గుంతపై బ్యారికేడ్‌ను ఏర్పాటు చేసేందుకే పరిమితమయ్యారు. దీని వల్ల ప్రమాదాలు మరింత ఎక్కువగా జరిగేందుకు అవకాశం ఉందని వాహనచోదకులు పేర్కొంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



‘అంతరంగ వీక్షణం’పై పరిచయ సభ

నెల్లూరు(బృందావనం): సాహితీవేత్తలతో విల్సన్‌రావు కొమ్మవరపు నిర్వహించిన ముఖాముఖి సంకలనం ‘అంతరంగ వీక్షణం’ పరిచయ సభను పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు సాహితీవేత్తలు హాజరుకానున్నారని వివరించారు.

షేర్లు, వ్యాపారాల్లో భాగస్వామ్యం పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ప్రముఖ కంపెనీల్లో షేర్లు.. వ్యాపారాల్లో భాగస్వామ్యం ఇప్పిస్తానంటూ పలువుర్ని మోసగించిన వ్యక్తిపై బాలాజీనగర్ పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని రామ్‌జీనగర్‌కు చెందిన ప్రసాద్ వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. ప్రముఖ కంపెనీలో షేర్లు.. వ్యాపారాల్లో భాగస్వామ్యం ఇప్పిస్తానని చిల్డ్రన్స్‌పార్క్ ప్రాంతానికి చెందిన శ్రావణ్‌కుమార్ వద్ద రూ.1.6 కోట్లను తీసుకొని మోసగించారు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. కాగా ప్రసాద్ ఇదే తరహాలో మరో పది మందిని మోసగించారని సమాచారం.

సుష్మశ్రీకి పురస్కారం



నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని మదర్ థెరీసా సేవారత్న అవార్డును నెల్లూరు గీతావైభవ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సుష్మశ్రీ గురువారం అందుకున్నారు. పోరుమామిళ్లలో సేవారత్న ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారని ట్రస్ట్ నిర్వాహకుడు నజీర్‌బాషా పేర్కొన్నారు.

లోతుగా విచారణ

నెల్లూరు(క్రైమ్): నకిలీ వే బిల్లులు, నకిలీ జీఎస్టీ నంబర్లతో ప్రభుత్వానికి పన్నులు ఎగవేస్తున్న వ్యాపారులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. గుట్కా మాఫియాపై ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో ఎన్టీఆర్‌నగర్‌లో మహేంద్రకు చెందిన గోదాముపై దాడులు చేసి గుట్కా, పాన్ మసాలాలను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వీటికి జీఎస్టీని చెల్లించకపోవడంతో విచారణను గురువారం చేపట్టారు. సదరు వ్యాపారి గుట్కాలను ఎక్కడ.. ఎంత మొత్తంలో కొనుగోలు చేశారు.. ఎవరెవరికి విక్రయించారు.. దీని తాలూకు జీఎస్టీ, వే బిల్లులు తదితరాలకు సంబంధించి పూర్తి స్థాయిలో ఆరాతీస్తున్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శీవేలి ఉత్సవం, మహాదీపారాధన తదితర పూజలను గురువారం జరిపారు. ఉభయకర్తలుగా అశోక్‌వర్ధన్‌రెడ్డి, గునపాటి పద్మనాభరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రయ్య, దొడ్ల శేషారెడ్డి వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.



చెరువనుకుంటే పొరపాటే..!



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నవాబుపేటలోని ఆరెస్సార్ మున్సిపల్ స్కూల్ ప్రాంగణం చెరువును తలపిస్తోంది. లెవలింగ్ సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. విద్యార్థులు నిరంతరం ఇబ్బందులు పడుతున్నా, నీటిని తొలగించే దిశగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఫలితంగా పాఠశాలకు వెళ్లాలన్నా, రావాలన్నా విద్యార్థులకు ఫీట్లు తప్పడంలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి జిల్లా వెంకటగిరిలో నివాసం ఉంటున్న చిన్నా కుమార్తె బీవీనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతూ అక్కడి హాస్టల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో కుమార్తెను చూసేందుకు గానూ కళాశాల వద్దకు చిన్నా బుధవారం వచ్చారు. ఆరా తీయగా హాస్టల్‌కు వెళ్లిపోయిందని అక్కడి సిబ్బంది చెప్పారు. అక్కడికి వెళ్లగా ఆమె కనిపించలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.